క్లుప్తంగా

సంచార పశువైద్యశాల వాహనం తనిఖీ

నందిగామ: సంచార పశు వైద్యశాల వాహనాలలో పనిచేస్తున్న సిబ్బంది అత్యంత బాధ్యతయుతంగా పనిచేయాలని డాక్టర్ భగేష్ మిశ్రా అన్నారు. నందిగామలోని సంచార పశువైద్యశాల వాహనాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వాహనంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకోవడంతోపాటు ఇప్పటివరకు ఎన్ని మూగజీవులకు వైద్య సేవలందించారనే అంశంపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు:వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజకిషోర్ హెచ్చరించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా రైతుల రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. వీఆర్వోల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

గరికపాడు(జగ్గయ్యపేట): గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో రైతుల కోసం బీపీటీ-5204 వరి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు కోఆర్డినేటర్ కృష్ణంరాజు బుధవారం తెలిపారు. 25 కిలోల బస్తా విత్తనాలను రూ. 1120లకు విక్రయిస్తున్నామని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డుతో కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నీట్‌లో శ్రీ భవిష్య కళాశాల విద్యార్థుల ప్రతిభ


రవళిక మచ్చ (676 మార్కులు)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్-2024 ఫలితాల్లో 720 మార్కులకు గాను దేవిరెడ్డి హేమహారిణి-676, రవళిక మచ్చ-676, భార్గవ్ నూతక్కి-673 మార్కులు సాధించారని శ్రీ భవిష్య అకాడమీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 667, 664, 662 వంటి అత్యధిక మార్కులతోపాటు 600 మార్కులకు పైగా 60 మంది, 550కి పైగా 173 మంది, 500కి పైగా 243 మంది, 480కి పైగా 301 మంది, 450కి పైగా 386 మంది తమ విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఈ ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. నీట్-2024 ఫలితాలలో శ్రీ భవిష్య విద్యార్థులు 350లకు పైగా ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లను సాధించే అవకాశం ఉందన్నారు. ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించినందుకు విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు అధ్యాపకులను కళాశాల డైరెక్టర్లు జి.వెంకట్రావు, డి.రామమూర్తి, ఎం.రామారావు, లక్ష్మీనారాయణ, టి.సతీష్, కె.కిషోర్‌బాబు, జి.రాజేశ్వరరావు, మూర్తి, పి.సతీష్, ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పర్యావరణ దినోత్సవ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, కాలుష్యం నియంత్రణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటింటా మొక్కలు పెంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని, మట్టిలో కరగని ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జనరల్ నాలెడ్జిపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

క్యాన్సర్ శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి వైద్య ఖర్చులకు గానూ బుధవారం సాయి మణికంఠ కేటర్స్ అధినేత జొన్నలగడ్డ రమేష్ బాబు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నగరానికి చెందిన సుబ్బు కుమార్తె చిన్నారి వేముల గీర్వాణి నిత్యశ్రీ క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు. చిన్నారికి శస్త్రచికిత్స సత్వరమే చేయాలని ఇందుకుగానూ రూ.35 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పారు. దీంతో రమేష్‌బాబు తన వంతు సాయంగా రూ. 25 వేలు చిన్నారి తండ్రి సుబ్బుకు అందజేశారు.

పేటకు మరో ఫైర్‌స్టేషన్ అవసరం

- మూడు మండలాలకు ఒకటే అగ్నిమాపక వాహనం
- ఏటా 100కు పైగా అగ్నిప్రమాదాలు
- తీవ్ర ఆస్తినష్టంతో ఇబ్బందులు


జగ్గయ్యపేటలోని ఫైర్‌స్టేషన్


గతేడాది పెనుగంచిప్రోలులో అగ్నిప్రమాదంతో దగ్ధమైన గుడిసెలు(ఫైల్)

జగ్గయ్యపేట అర్బన్ : జగ్గయ్యపేట నియోజకవర్గంలో మూడు మండలాలకు కలిపి ఒకే అగ్నిమాపక కేంద్రం ఉండటంతో పలుమార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఆశాఖకు ఏర్పడింది. అదనంగా మరో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం ప్రతి 50వేల జనాభాకు ఓ అగ్నిమాపక కేంద్రం ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం నియోజకవర్గ జనాభా సుమారు 3లక్షలకు చేరింది. దీనికితోడు పారిశ్రామికంగా కూడా నియోజకవర్గం అభివృద్ధి చెందింది. పేట పట్టణం చుట్టూ పరిశ్రమలు అధికంగా ఉండటంతో పారిశ్రామికవాడగా కూడా పేట ప్రసిద్ధి చెందింది. పేట ఫైర్‌స్టేషన్ పరిధిలో రామ్‌కో, కేసీపీ, హేమాద్రీ, అల్ట్రాటెక్ వంటి అతిపెద్ద సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ముక్త్యాలలో రెండు, వేదాద్రిలో ఒకటి, ఆటోనగర్‌లో 3 చొప్పున కెమికల్ ఫ్యాక్టరీలు ఉండగా, పేటకు ఆనుకుని ఉన్న ఆటోనగర్‌లో పెద్ద, చిన్నవి కలుపుకుంటే 15 వరకు పరిశ్రమలు ఉన్నాయి. వీటన్నింటి దృష్ట్యా అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున మరో ఫైర్ స్టేషన్ ఆవశ్యకత ఎంతైనా ఉంది.

78 గ్రామాలకు ఒక్కటే వాహనం...

పేట నియోజకవర్గంలో వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేటతో కలిపి మూడు మండలాలలో కలిపి 78 గ్రామాలు ఉన్నప్పటికి పేట మున్సిపాలిటీ కేంద్రంగా ఒకేఒక్క అగ్నిమాపక కేంద్రం ఉంది. ప్రస్తుతం ఫైర్‌సిబ్బంది కూడా 16మంది ఉండాల్సి ఉండగా, 13మంది ఉన్నారు. ముగ్గురు ఫైర్‌మెన్‌ల కొరత ఉంది. నియోజకర్గ పరిధిలో సుమారు 25 నుంచి 30కిలోమీటర్ల మేర విస్తరించిన గ్రామాల్లో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే తక్షణమే వెళ్లి ప్రమాదాన్ని నివారించలేకపోతున్నారు. సుదూరంగా గ్రామాలు ఉండటంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఆపద సమయంలో సమాచారం రాగానే వెంటనే తమ వాహనంతో బయలుదేరి వెళ్లే టప్పటికి సంఘటన జరిగిన స్థలానికి చేరుకునేలోగానే జరగాల్సిన నష్టం జరుగుతుందని బాధితులు కూడా వాపోతున్నారు. దీంతో వేసవిలో ప్రమాదాలు సంభవించినప్పుడు ఒకేసారి అన్నిగ్రామాలను కవర్ చేయడం ఇబ్బందిగా ఉంటుందని ఫైర్ సిబ్బంది చెబుతున్నారు.

గతేడాది భారీ ఆస్తినష్టం..

పేట నియోజకవర్గంలో ఏడాదికి కనీసం 90 నుంచి 100 వరకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల పలు పెద్ద ప్రమాదాలు చోటుచేసుకోవడంతో తీవ్రమైన నష్టం వాటిల్లింది. గతేడాది పెనుగంచిప్రోలు చిన్నతిరునాళ్లలో గ్యాస్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుని 50గుడిసెలు దగ్ధమయ్యాయి. గుడిసెకు రూ.1 లక్ష చొప్పున 50 గుడిసెల యజమానులకు రూ.50 లక్షల వరకు నష్టం జరిగింది. అనుమంచిపల్లి లోని రైస్‌మిల్లులో ప్రమాదం జరిగి రూ 1.50 కోట్ల నష్టం వాటిల్లింది. షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్ వద్ద ఉన్న ఆటోనగర్‌లోని ఫ్యాన్స్ స్పిన్నింగ్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి రూ.2లక్షలమేర నష్టం జరిగింది. అదే మరో అగ్నిమాపక కేంద్రం ఉండి ఉంటే ఈ ప్రమాదాల నష్టం కొంతమేరకైనా తగ్గేదని జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. కావును ఆదిశగా అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

సామినేని ఉదయభాను


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఉదయభాను

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికలలో వచ్చిన ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. ఫలితాలు వచ్చిన వద్ద నుంచి గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని ఉదయభానుకు వివరించగా, విషయాన్ని తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ధైర్యంగా ఉండాలని వారికి వివరించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచామని దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. అనంతరం నియోజకవర్గ ఎన్నికల ఫలితాల సరళిపై చర్చించారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు


ఫ్యాన్సీ డ్రస్ పోటీదారులతో గ్రంథాలయ సిబ్బంది


కంచికచర్లలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణనిస్తున్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా 18వ రోజు బుధవారం విద్యార్థులచే పుస్తక పఠనం, దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివించారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీల్లో భాగంగా విద్యార్థులు మాజీప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, భగత్‌సింగ్, పెళ్లికొడుకు, ఇంజినీరు, ఐఏఎస్ ఆఫీసర్, యాంకర్, న్యూస్‌రీడర్, రిపోర్టర్ వేషధారణల్లో అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు రాష్ట్రప్రభుత్వం గ్రంథాలయాల్లో ఈనెల 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఉద్దేశించి బుధవారం ఆయన ప్రసంగించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం, యోగా, నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణనిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, డాన్స్‌మాస్టర్ వేల్పుల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


చిల్లకల్లులో మొక్కలు నాటుతున్న అధికారులు, సిబ్బంది


రామ్‌కోలో మొక్కలు నాటుతున్న అశిష్‌కుమార్


మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఉషారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా నేలమడులు కట్టి విత్తనాలు నాటడం, కూరగాయలు చెత్త గుంటలోవేసి ఎరువుగా తయారు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మునగ, జామ, కరివేపాకుమొక్కలను అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, ఆరోగ్య కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కలతో కాలుష్యం దూరం

వత్సవాయి :మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని దూరం చేయవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు, కూరగాయల విత్తనాలను నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. మొక్కలు నాటితే కలిగే ప్రయోజనాలపై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలని తల్లిదండ్రులను కోరారు.

మండవ ఇంజినీరింగ్ కళాశాలలో...

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మండవ ఇంజినీరింగ్ కళాశాలలో బీఎస్అండ్‌హెచ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సభ్యులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్యామ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కళాశాల కార్యదర్శి మండవ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో...

జయంతిపురం(జగ్గయ్యపేట): పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలని రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవాత్సవ్ కోరారు. జయంతిపురంలోని ఫ్యాక్టరీ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా పర్యావరణం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని పెరుగుతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతల వల్ల సమస్త జీవులు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌కె మూర్తిరావు, జీఎం ఫరూక్ మహ్మద్, హెచ్‌ఆర్ రామకృష్ణసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకల్లులో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిల్లకల్లులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి లక్ష్మీభార్గవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాల్లో కార్యకర్తలంతా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నాగమణి, కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ కృష్ణంరాజు, వైద్యాధికారి ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఉషారాణి


కూరగాయల విత్తనాలు చల్లిస్తున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

మొక్కల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి శ్రావణి, న్యాయవాదులు


నందిగామ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి డి.శేషయ్య

నందిగామ: మొక్కలు పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని నందిగామ 16వ అదనపు కోర్ట్ ఇన్‌చార్జి న్యాయమూర్తి డి.శేషయ్య సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు భవనాల ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే విషయంలో ప్రతిఒక్కరూ అత్యంత బాధ్యతయుతంగా వ్యవహరించాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని చందాపురం ఎంపీ యూపీ పాఠశాలలో హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట కోర్టు ఆవరణలో..

జగ్గయ్యపేట అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, విధిగా తమ గృహాల వద్ద మొక్కలు నాటాలని జగ్గయ్యపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రావణి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన అనంతరం న్యాయమూర్తి శ్రావణి మాట్లాడుతూ సమస్త జీవకోటికి పర్యావరణమే జీవమన్నారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు, కార్యదర్శి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పి.సత్యశ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు వెంకట్రామయ్య, దామాల సంతోష్, దాసరి నాగేశ్వరరావు, కృష్ణయ్య, కళావతి, గాంధీ, కరిసె రత్నబాబు పాల్గొన్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకే ప్రతి ఏటా ఎక్స్‌రే, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే గ్రూప్ సంస్థల ప్రధాన బాధ్యులు కొల్లూరి అన్నారు. సాంబమూర్తి రోడ్డులో బుధవారం 65 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఏటా వేసవిలో ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, అంజలి, గీతాంజలి, దుర్గాతేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త నిర్వహణలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తాము చేస్తున్న సేవలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 వరకు 65 రోజులుగా దాదాపు 15,000 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ చేశామని చెప్పారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయపడే మనస్తత్వం అలవర్చుకోవాలని కోరారు. వేసవి మండే ఎండలలో వడగాల్పులను సైతం లెక్కచేయక అకుంఠిత దీక్షతో మజ్జిగ పంపిణీ నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. మజ్జిగ పంపిణీ చైర్మన్ గోపు రాము, వైస్ చైర్మన్ పొత్తూరి సీతారామారావు సభ్యులు కనకవల్లి, చామర్తి వెంకట సుబ్బయ్య, బ్రహ్మదేశం వసంత కుమార్, గుర్రం ఏడుకొండలు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన, పుస్తక సమీక్ష, కథల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై పోటీలు జరిగాయి. పోటీలను గణపతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అసాధారణ నైపుణ్యం దాగి ఉంటుందని, అది వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి మాట్లాడుతూ గురువారం క్యారమ్ బోర్డ్, చదరంగం పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలి పిలుపునిచ్చారు. విజేతలకు 7న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ బాలు గీతాలు అజరామరం


గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు పద్మశ్రీ డాక్టర్ శ్రీపాద పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలు) స్వరం చిరస్మరణీయమని, ఆయన స్వరం నుంచి వెలువడిన గీతాలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాల్‌లో నిర్వహించిన దశకంఠుడు ఎస్పీ బాలు స్వరాభిషేకం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఎస్పీ బాలు గానం చేసిన పలు గీతాలను ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీలతో పాటు పలువురు గాయనీ గాయకులు శ్రావ్యంగా ఆలపించారు.

గాన గంధర్వుడు ఎస్పీ

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సినీ రంగంలో అనేక మంది ప్రముఖ హీరోలకు వారి గొంతులకు అనుగుణంగా పాటలు పాడిన బాలును సినీ ప్రియులు మరిచిపోలేరన్నారు. డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ ఎందరో మహానుభావులు రచించిన పాటలకు ప్రాణం పోసిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. దామోదర గణపతిరావు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరుకు చెందిన మహాదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు బుధవారం సాయంత్రం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం మామిడాల పావని పర్యవేక్షణలో సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హారిణి, హేమ, వివక్త, లాస్య, దుర్గా, జయలక్ష్మిల శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ సాయం


చిన్నారి తండ్రి బాజీరావుకు నగదు అందజేస్తున్న సీఐ మహేంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి నిశిక వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన తండ్రి బాజీరావు చిన్నారి ఆపరేషన్ సాయానికి దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసుల తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టూ ట్రాఫిక్ సీఐ మహేంద్ర, గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ నాగేంద్ర బాబు, బ్రహ్మం హాస్పిటల్‌కు వెళ్లి బాధితురాలు తండ్రి బాజీరావుకు నగదును అందించారు. చిన్నారి తండ్రి బాజీరావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామని తెలిపారు.